జాతీయస్థాయి పోటీలో విజేతగా 'ఈభాషా సేతు'

రాయదుర్గం: కేంద్రం ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలో భాషిణి గ్రాండ్ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని స్టార్టప్ ఈ భాషా సేతు విజేతగా నిలిచింది. దీంతో ఈ ఛాలెంజ్‌లో రూ. 25 లక్షల నగదు పురస్కారాన్ని కైవసం చేసుకుంది. 10 భారతీయ భాషలలో రికార్డులను అనువాదం, డిజిటలైజేషన్ కోసం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు కూడా అవకాశం కలిగిందని ఈభాషా సేతు స్టార్టప్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రషీద్ అహ్మద్ వివరించారు. 'లాంగ్వేజ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్' ఎల్‌టీఆర్సీ ప్రొఫెసర్ రాజీవ్‌సంఘాల్, ప్రొఫెసర్ దీప్తిమిశ్రా శర్మ, డాక్టర్ వినిత్‌చైతన్య పర్యవేక్షణలో రషీద్‌అహ్మద్, పవన్‌కుమార్‌లు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా వారిని ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో.రూల్లో..) టమాటా రూ.30, పచ్చిమిర్చి 60, బెండకాయ 50, కాకర 60, దొండ 50, దోసకాయ 40, ఆలుగడ్డ 35, చామగడ్డ 60, కీర 30, బీరకాయ 60, వంకాయ 35, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 35, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 90, ఉల్లిగడ్డ 25 (కేజీ), ములక్కాయలు (2)రూ.10, క్యాలీఫ్లవర్ (1) రూ.40, సొరకాయ (కిలో) రూ.30, అల్లం 170, వెల్లుల్లి రూ.270గా ఉన్నాయి.

నేటి సంతల వివరాలు..

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో వారంతపు కూరగాయాల సంత గంగారంలో బుధవారం, హుడా కాలనీలో గురువారం, ఆర్టీసీ కాలనీలో బుధవారం, మదీనాగూడ గ్రామంలో ఆదివారం, మైత్రినగర్ మంజీరా రోడ్డులో శనివారం, ఆల్విన్ కాలనీలో గురువారం, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో గురువారం, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద గురువారం, 5వ ఫేజ్ వద్ద బుధవారం కూరగాయాల సంత ఉంటుంది.

మాదాపూర్ డివిజన్ పరిధిలో....

మాతృశ్రీనగర్‌లో సోమవారం, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద ఆదివారం, 80 ఫీట్ల రోడ్డులో బుధవారాల్లో వారాంపు కూరగాయాల సంతలు నిర్వహిస్తున్నారు.

శిల్పారామంలో కూచిపూడి వర్క్‌షాప్

- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు
- జూన్ 5 వరకు ఎత్నిక్‌హాల్‌లో కొనసాగనున్న శిక్షణ



విద్యార్థినులతో శంకరాభరణం ఫేమ్ మంజుభార్గవి

మాదాపూర్: కూచిపూడి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తితో పాటు ఇంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి. నిత్యం నృత్య సాధనతో ధైర్యం, మేధాశక్తి, సమయపాలన అలవాటు అవుతాయని నాట్య గురువులు చెబుతున్నారు.

- మాదాపూర్‌లోని శిల్పారామంలో విద్యార్థులకు కూచిపూడి డ్యాన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా కూచిపూడి నృత్యాంశాలలో అనేక మెలకువలను నేర్పిస్తున్నారు. స్టేజ్‌షోలు చేసే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొని శిక్షణ పొందుతున్నారు.
- నాట్యాలయాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గురువులు వర్క్‌షాప్‌లను నిర్వహించాలని, దీంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని నాట్యగురువు రమణీసిద్ధి తెలిపారు.
- సీనియర్ గురువులతో విద్యార్థులకు కూచిపూడి నాట్యాంశాలలో మెలకువలను వివరించేలా వర్క్‌షాప్‌లను పలువురు కోరుతున్నారు.
- 15 రోజుల పాటు నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ నాట్యగురువు, శంకరాభరణం ఫేమ్ మంజు భార్గవి విద్యార్థులకు పలు అంశాల్లో మెలకువలను నేర్పారు.
- విద్యార్థులు తొందరగా నేర్చుకోవాలనే ఆరాటం కంటే క్రమపద్ధతిలో శిక్షణ తరగతులను నేర్చుకోవాలని తెలిపారు.
- కూచిపూడి నాట్యం నేర్చుకోవడం వల్ల ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. నాట్యాలయాలను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు శిక్షణ ఇవ్వవచ్చు.
- ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు.
- రోజువారీగా వర్క్‌షాప్‌లో గురువులు రమణీసిద్ధి, మృత్యుంజయశర్మలు విద్యార్థులకు సహకరిస్తున్నారు.



వర్క్‌షాప్ ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థుల్లో ఆసక్తి ఉండాలి..



నేర్చుకోవాలనుకునే విద్యార్థులు భక్తిశ్రద్ధలతో, ఆసక్తి కలిగి ఉండాలి. నాట్యం చూపరులను ఆకట్టుకోవాలి. వర్క్‌షాపులను నిర్వహించడం వల్ల ఆసక్తికర విషయాలతో పాటు విద్యార్థులకు నాట్యంపై మరింత ఆసక్తి కలుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సీనియర్ గురువుల ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై మెలకువలను చెప్పించాలి.

– గురువు రమణీసిద్ధి

కొత్తకొత్త విషయాలను నేర్చుకుంటున్నా..



స్టేజ్‌షోలలో చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ వర్క్‌షాప్ ద్వారా తెలుసుకున్నాను. సర్టిఫికెట్ కోర్సులతో పాటు డిప్లొమా కోర్సులను చేయాల్సి ఉంది. ఇంట్లో అందరూ సహకరిస్తారు. కూచిపూడి నృత్యంలో మంచిపేరు తెచ్చుకుని నేను ఓ గురువుగా ఎదగాలని ఉంది.

– దివ్య, విద్యార్థిని ఎల్బీనగర్

50కి పైగా స్టేజ్‌షోలు ఇచ్చాను..



ప్రస్తుతం నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. 50కి పైగా స్టేజ్ షోలు ఇచ్చాను. 11 ఏళ్ల నుంచి కూచిపూడిలో శిక్షణ పొందుతున్నాను. ఇతర దేశాల్లో సైతం స్టేజ్‌షోలు ఇవ్వాలని ఉంది. వర్క్‌షాప్ ద్వారా మరిన్ని మెలకువలను నేర్చుకుంటున్నాను. అన్ని వర్క్‌షాప్‌లో పాల్గొంటా.

– సాయిలీల, విద్యార్థిని

మంచి కూచిపూడి డ్యాన్సర్‌గా పేరు తెచ్చుకుంటాను..



నేను బెంగుళూరు నుంచి నగరానికి వచ్చాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఐటీ ఉద్యోగం కంటే కూచిపూడి డ్యాన్సర్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది.

– దుర్గా, విద్యార్థిని

'మనూ'లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా గురువారం తెలిపారు. ఈ విభాగంలో పోస్టుగ్రాడ్యుయేషన్ ఎంఏ కోర్సుతో పాటు పీహెచ్‌డీ కోసం అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించాలని, పీహెచ్‌డీ కోర్సుకు చివరి తేదీ మే 30వ తేదీగా, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు చివరి తేదీ జూన్30 గా నిర్ధారించామన్నారు. 40 శాతం మార్కులతో ఏదైనా గ్రాడ్యుయేట్ రెండేళ్ల రెగ్యులర్ కోర్సు ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రవేశానికి అర్హులని స్పష్టం చేశారు. ప్రవేశానికి వయోపరిమితి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ కోర్సు 3 నుంచి 6 ఏళ్ల కాలవ్యవధి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్‌లో కనీసం 55 మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు అర్హులన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం పొందుతారన్నారు. అభ్యర్థులు ఉర్దూను భాషగా లేదా ఉర్దూ మాధ్యమం ద్వారా అభ్యసించినట్లు నిరూపించుకోవాలన్నారు. ఎంఏ కోర్సు విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యసేవలు, ప్రామాణిక లైబ్రరీ, హాస్టల్, క్రీడా సౌకర్యాలు కూడా క్యాంపస్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. యూజీ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారమ్‌లు, ప్రాస్పెక్టస్‌లు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 040–23008449, 9705704939.

ఘనంగా గౌతమ బుద్ధ జయంతి వేడుకలు



చందానగర్‌లో నివాళులర్పిస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

హఫీజ్‌పేట్ : గౌతమ బుద్ధ జయంతి సందర్భంగా చందానగర్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ హాజరై బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం సుఖసంతోషాలతో ఉండాలంటే బుద్ధుడు సూచించిన అష్టాంగమార్గం ద్వారా శాంతి, సహనం సాధ్యమన్నారు. అసోసియేషన్ సభ్యులు జనార్దన్, పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, బాలరాజుయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటాచారి, వికాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్ : మయూరినగర్, లక్ష్మీనగర్, న్యూ – కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరీష్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు మయూరినగర్, ఎస్‌బీఐ బ్యాంక్‌లైన్, 1.30 నుంచి 3 గంటల వరకు జోవాకాలనీ, లక్ష్మీనగర్, 3.30 నుంచి 5 గంటల వరకు న్యూ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్...

జేపీఎన్‌నగర్, దత్తసాయినగర్, స్వర్ణపురికాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాగార్జున ఎన్‌క్లేవ్, జేపీఎన్‌నగర్, ఫేస్ –1, 2లలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు లక్కీ రెస్టారెంట్ వెనుకవైపు ఏరియా, బాలాజీనగర్, దత్తసాయినగర్, శ్రీరంగపురం కాలనీ, అరబిందో కాలనీ, జేపీఎన్‌నగర్ మెయిన్ రోడ్డు, 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌ఎంటీ మక్త, హెచ్‌ఎంటీ కాలనీ, పీఏనగర్, రెయిన్‌బో వెంచర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజ్‌కుమార్ ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హఫీజ్‌పేట్ : వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

- శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, ఆర్ఎస్ బ్రదర్స్ వెనకాల, శ్రీరాంనగర్, స్వాగత్‌హోటల్, గౌతమీనగర్ చందానగర్ పోలీస్‌స్టేషన్ దగ్గర, గిరిజ అపార్ట్‌మెంట్స్, శిల్పాఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు ఇక్రిశాట్ కాలనీ, డీపీఎస్ స్కూల్ దీప్తిశ్రీనగర్, పీజేఆర్ ఎన్‌క్లేవ్ మెయిన్ రోడ్డు, అయ్యప్పస్వామి టెంపుల్ దగ్గర పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు.
- భవానీపురం ఫీడర్ పరిధిలో సాయంత్రం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు శంకర్‌నగర్, భవానీపురం, శంకర్‌నగర్ విల్లాస్, వేమనరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కొమరంభీమ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఎన్‌జీఓకాలనీ ఫేజ్–1, ఫేజ్–2 కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

- 11 కేవీ చర్చి విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నానక్‌రాంగూడలో నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.
- 11 కేవీ గోల్ఫ్‌వ్యూ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీఎస్ ఐఐసీ ప్రాంతం, ఎమ్మార్ ప్రాపర్టీస్, నానక్‌రాంగూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా 11కేవీ లేక్‌వ్యూ ఫీడర్ పరిధిలో శుక్రవారం సరఫరాను నిలిపేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డీమార్ట్ వెనుకవైపు, నల్లగండ్ల కమ్యూనిటీహాల్ ప్రాంతం, సైబర్ లైఫ్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

- 11 కేవీ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సాధన స్కూల్ వెనుక ప్రాంతం, ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్, రాక్‌పార్కు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం

ఇంటికి చేరిన వైనం

గచ్చిబౌలి: డ్యూటీకి వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు ఎట్టకేలకు తిరిగి ఇంటికి చేరాడు. గచ్చిబౌలి పీఎస్ పరిధిలో మహ్మద్ అఫ్జలుద్దీన్(33) అదృశ్యమైన విషయం తెలిసిందే. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బిర్లాసాఫ్ట్ కంపెనీలో సీసీటీవీ సర్వీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 19న ఉదయం డ్యూటీకి వచ్చి పని ఉందని బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఉన్నట్లు కుటుంబసభ్యులు గుర్తించి నగరానికి తీసుకొచ్చారు. యువకుడు అఫ్జలుద్దీన్, తండ్రి మహ్మద్ అఫ్సరుద్దీన్‌లు గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చి పోలీసులను కలిసి వెళ్లారని ఏఎస్సై సాయన్న తెలిపారు.

బాలుడి అదృశ్యం



సంజీవ్ కుమార్

మియాపూర్ : ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్‌కు చెందిన తిరుమలేష్ రెండో కుమారుడు సంజీవ్‌కుమార్ (17) పటాన్‌చెరులోని రెసోనన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం గద్వాల్ నుంచి సంజీవ్‌కుమార్ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వచ్చాడు. మియాపూర్ మెట్రోస్టేషన్‌లో దిగి కళాశాలకు వెళ్లలేదు. ఈ క్రమంలో మియాపూర్ మెట్రోస్టేషన్‌లో రైలు దిగినట్లు తన స్నేహితులు చెప్పారు. రాత్రైన ఇంటికి రాకపోవడంతో తండ్రి తిరుమలేష్ ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా.. ఆచూకీ లభించలేదు. దీంతో అతడు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు.. పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మియాపూర్ : ప్రధాన రహదారులపై మురుగు ప్రవాహంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మియాపూర్‌లోని బొల్లారం రోడ్డు, రెడ్డిల్యాబ్ ముందు రోడ్డులో, శ్రీరంగపురం కాలనీ రోడ్డుపై మురుగు నీరు మ్యాన్‌హోళ్ల నుంచి పొంగి ప్రవహిస్తోంది. రోడ్డుపై మురుగు ప్రవహించడంతో స్థానికులు, వాహనదారులు దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసేవారికి అవకాశాలు



నియామకపత్రాలను అందజేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన అవకాశాలు వస్తాయని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. నల్లగండ్లలో రంగారెడ్డిజిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా కల్పనాఏకాంత్‌గౌడ్, ఎలాల ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురరం ముత్యంరెడ్డిలకు గురువారం ఆయన నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుందన్నారు. ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులు ఉచిత విద్యుత్, గ్యాస్ తదితర పథకాలను అందిస్తున్నామన్నారు. టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ సంజీవరెడ్డి, నాయకులు కృష్ణముదిరాజ్, వీరేందర్‌గౌడ్, సౌందర్యరాజన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చెఫ్ అసోసియేషన్ వార్షికోత్సవం



తెలంగాణ చెఫ్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు చెఫ్ ధర్మేంద్రలంబా తదితరులు

- ప్రతిభ కనబరిచిన వారికి అవార్డుల ప్రదానం
- నీరు, ఆహారం వినియోగం, ప్రాముఖ్యతపై చర్చ

మాదాపూర్ : పాక ప్రపంచంలో చెఫ్‌ల పాత్ర ఎనలేనిదని తెలంగాణ చెఫ్ అసోసియేషన్ అధ్యక్షులు చెఫ్ ధర్మేంద్రలంబా పేర్కొన్నారు. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో గురువారం తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండస్ట్రీ దిగ్గజాలు, చెఫ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ నీటి సంక్షోభమని, నీటిపై ఆధారపడిన సంస్థగా దీనిని పేర్కొనవచ్చన్నారు. ఆహారాన్ని పొదుపుచేయడంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెఫ్ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. భారతదేశంలోని ఎఫ్‌అండ్‌బీ పరిశ్రమలో పెరుగుతున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమన్నారు. గోవా, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూషన్ విద్యార్థులు, నిపుణులు, గృహిణులు, ప్రఖ్యాత చెఫ్‌లు హాజరై పలు విషయాలపై చర్చించారన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని అవార్డులతో సత్కరించారు. బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్ ఓవెన్, బీ– స్కూల్ గెస్ట్ లెక్చరర్ రామచందర్ పూడిపెద్ది ఉన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లై అధికారులు సందర్శించారు. డీఎం కొండల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ తేజశ్విని, తహసీల్దార్ భిక్షపతి గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు మాట్లాడుతూ.. రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని, ఎలాంటి ధాన్యమైనా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఐకేపీ ఏపీఓ నరేందర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని 132 సర్వేనంబర్‌లోని కుడికుంటలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సాయికిరణ్ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతలు శిఖం భూముల్లో షెడ్డులను వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

మియాపూర్ : మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హుడా అధికారులు గురువారం కూల్చివేశారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీ సమీపంలో కొందరు 100,101 సర్వేనంబర్‌లోని స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రూమ్‌లను హుడా అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. తిరిగి నిర్మాణాలు చేపడితే వారిపై కఠినచర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇనార్బిట్‌లో చిన్నారులకు వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారులకు వేసవి వినోదాన్ని అందించడానికి మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ లాస్ట్ పైరేట్ కింగ్‌డమ్ పేరిట థీమ్ ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని మాల్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిల్టీ లూకర్ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ జాయింట్ ఆక్టోపస్ టెంటకిల్స్ అలంకరణ ఆకట్టుకుంటాయని నిర్వాహకులు తెలిపారు. పైరేట్ క్యాప్స్, టెలిస్కోప్స్ తదితర ఆసక్తికరమైన వస్తువుల తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం జూన్ 2 వరకు కొనసాగుతుందన్నారు.

వీధి లైట్‌ల కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్డు నెం–7లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఇంద్రానగర్‌కాలనీ మీదగా కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు అభివృద్ధి చేసిన రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో మాణిక్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనిల్ కుమార్‌పై పీటీ వారెంట్

గచ్చిబౌలి: చిత్రపురి కాలనీ ఫ్లాట్ల అలాట్‌మెంట్, రిజిస్ట్రేషన్లలో అవకతవకలపై రాయదుర్గం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రధాన నిందితుడిగా ఉన్న తెలుగు సినీ వర్కర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అతడిపై అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఒక కేసులో మాత్రమే అరెస్ట్ చేశారు. మరో నాలుగు కేసుల్లో నిందితుడిగా పరిగణించాలని రాజేంద్రనగర్ కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేసినట్లు సీఐ వెంకన్న తెలిపారు. ఫ్లాట్ల అలాట్‌మెంట్ల రద్దు, అక్రమ రిజిస్ట్రేషన్లతో రూ.కోట్లు దండుకున్న మరి కొందరికి ఉచ్చు బిగుస్తోంది. త్వరలోనే మరిన్ని అరెస్టులు ఉండవచ్చునని రాయదుర్గం పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్

950 గ్రాములు స్వాధీనం

హఫీజ్‌పేట్ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు ఎంజీరోడ్డు, భగత్‌గల్లికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (23) గుల్‌మోహర్ పార్కు బాపునగర్‌లో నివాసముంటూ.. ఆర్సీపురంలో పాన్‌షాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, కందుకూరు మండలం శాకావనంకు చెందిన యనమల మహేష్ (19) ఖైరతాబాద్‌లో ఉంటూ.. చదువుకుంటున్నాడు. గురువారం గుల్‌మోహర్ పార్కు వద్ద మధ్యాహ్నం 3.30 గంటలకు చందానగర్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. అటుగా వస్తున్న సయ్యద్ ఇమ్రాన్, మహేష్‌లు పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా.. సుమారు రూ.44వేల విలువైన 950 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కారు బోల్తా.. ఒకరి మృతి

నల్లగొండ : దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. కారులో ఉన్న మిగిలిన నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చలివాది రేఖాప్రియాంక(31), భర్త శివసుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్యభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిక్షిత్, తేజీవర్ధన్ సంతానం కాగా.. కుటుంబంతో కలిసి తిరుపతికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున డ్రైవర్ కారును అతివేగంగా నడపడంతో నల్లగొండ జిల్లా తిప్పర్తి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రేఖాప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహేంద్రపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.